### వాహనాల ట్రాఫిక్‌తో బెంగళూరులో ప్రయాణం నరకప్రాయం..

న్యూఢిల్లీ, వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో కర్ణాటక రాజధాని బెంగళూరు దేశంలోనే మొదటి స్థానంలో.. ప్రపంచంలో ఆరో స్థానంలో ఉన్నది. ఆ తర్వాత పుణెలో భారీగా ట్రాఫిక్ ఉంటున్నదని ఆమ్‌స్టర్‌డామ్ కేంద్రంగా పనిచేసే లొకేషన్ టెక్నాలజీ సంస్థ టోమ్‌టోమ్ వెల్లడించింది.ప్రపంచంలోకెల్లా అత్యంత ట్రాఫిక్ ఉండే నగరం లండన్ అని, ఇక్కడ 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటు సమయం 37 నిమిషాల 20 సెకండ్లు పడుతుందని పేర్కొన్నది. నివేదిక ప్రకారం బెంగళూరు, పుణెల్లో ఈ ప్రయాణ సమయం వరుసగా 28 నిమిషాల 10 సెకండ్లు, 27 నిమిషాల 50 సెకండ్లుగా ఉన్నది. అదేవిధంగా అత్యంత రద్దీ నగరాల్లో ఐర్లాండ్ రాజధాని డబ్లిన్ తర్వాత బెంగళూరు రెండో స్థానంలో ఉన్నది.

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 08 సంచిక :302 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 06-02-2024 | పేజీలు:4 వెల: 2.00

## వాహనదారులూ..తస్మాత్ జాగ్రత్త



హైదరాబాద్,పన్ను చెల్లించకుండా వాహనం తప్పితే చిక్కుల్లో పడ్డట్లే... హెచ్చరిస్తున్న రవాణశాఖ అధికారులు తెలంగాణ వ్యాప్తంగా త్రైమాసిక పన్ను చెల్లించని వాహనదారుల వివరాలను రవాణాశాఖ అధికారులు సేకరించారు. ఇప్పటివరకూ సుమారు 37 కోట్ల రూపాయల వరకు వాహనదారులు చెల్లించాల్సి ఉందని గుర్తించారు. దీంతో పన్ను చెల్లించకుండా రోడ్లపై తిప్పుతున్న వాహనదారులపై ప్రత్యేక దృష్టిసారించారు. వాహనదారులు పన్ను చెల్లించే గడువు జనవరి 31తో ముగియగా.... మొదటి నెలలో వాహనదారులు పన్ను చెల్లిస్తే 25శాతం, రెండవ నెలలో చెల్లిస్తే 50శాతం అదనపు పన్నుతో ఫీజు వసూలు చేయాలని రవాణా శాఖ నిర్ణయించింది. అలా కాకుండా పన్ను చెల్లించకుండా వాహన తనిఖీల్లో దొరికితే మొదటి నెలలో వందశాతం జరిమానా, రెండవ నెలలో దొరికితే 200 శాతం జరిమానా విధిస్తామని రవాణా శాఖ అధికారులు హెచ్చరించారు. అందుకే వాహనదారులు పన్నులను తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తనిఖీల్లో దొరికితే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టే ప్రసక్తే ఉండదని హెచ్చరిస్తున్నారు..; పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలపై తనిఖీలు చేపట్టినట్లు రవాణా శాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 220 వాహనదారుల నుంచి 10లక్షల 38వేల 300 రూపాయల పన్నులను, 4లక్షల69వేల320 రూపాయల కాంపౌండింగ్ ఫీజును వసూలు చేసినట్లు హైదరాబాద్ సంయుక్త రవాణాశాఖ అధికారి రమేష్ తెలిపారు. సెంట్రల్ జోన్ పరిధిలో 76 కేసులు నమోదు కాగా.... 4లక్షల రూపాయలకు పైగా పన్ను, లక్షా 84వేల 20 రూపాయల కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. నార్త్ జోన్ పరిధిలో 52 కేసులు నమోదు కాగా... లక్షా 71వేల 600రూపాయల పన్ను, లక్షా 14వేల 620 రూపాయల కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. ఈస్ట్ జోన్ పరిధిలో 40 కేసులు నమోదు కాగా... లక్షా 54వేల180 రూపాయల పన్ను, 79వేల770 కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. సౌత్ జోన్ పరిధిలో 36 కేసులు నమోదు కాగా.... లక్షా 45వేల 880 రూపాయలను పన్నుగా..., 51వేల 430 కాంపౌండింగ్ ఫీజుగా వసూలు చేశారు. వెస్ట్ జోన్ పరిధిలో 16 కేసులు నమోదు కాగా....లక్షా 65వేల 525 రూపాయలు పన్నుగా....., 39వేల 480 రూపాయలు కాంపౌండింగ్ ఫీజుగా వసూలు చేసినట్లు అధికారులు వివరించారు. తమ వద్ద డబ్బులు లేకపోవడంతోనే త్రైమాసిక పన్ను చెల్లించలేకపోతున్నామని వాహనదారులు చెబుతున్నారు. ఫీజులో రాయితీ కల్పిస్తే తమకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుందని రవాణా శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొమురవెల్లిలో కష్టాల కోలాటం.. సౌకర్యాలు లేక తప్పని ఇక్కట్లు



చేర్యాల,సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల 3వ ఆదివారం సందర్భంగా క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. 50వేల మందిగాపైగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, సనత్‌నగర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు కుటుంబ సమేతంగా మల్లన్నను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

'మల్లన్న' భక్తులకు ఇక్కట్లు

ఆలయవర్గాలు, పోలీసుల ఆంక్షల కారణంగా భక్తులు ఈసారి చాలా ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతాల నుంచి కొమురవెల్లికి ప్రైవేటు వాహనాల్లో రాగా, వాహనాలను క్షేత్రానికి చాలాదూరంలోనే పోలీసులు నిలిపివేయడంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తమ సామగ్రి నెత్తిన పెట్టుకుని ఇబ్బందులు పడుతూ ఆలయానికి చేరుకున్నారు. గదులు దొరకకపోవడంతో పరిసరాల్లో గుడారాలు వేసుకున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వేకువజామునే ఆలయ క్యూలైన్లకు వచ్చిన భక్తులకు గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది.స్వామి వారి క్షేత్రంలోని ఆలయానికి అనుకుని ఉండే వీఐపీ గెస్ట్‌హౌస్ నంబర్‌వన్ నుంచి చాలామంది పైరవీలతో ప్రవేశించడంతో సామాన్య భక్తులు మల్లన్న దర్శనం కోసం గంటలపాటు వేచి ఉండాల్సి వచ్చింది. క్షేత్రంలో దాతలు నిర్మించిన గదులు నిండిపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ప్రైవేటులో రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు చెల్లించి జేబులు ఖాళీ చేసుకోవాల్సి వచ్చింది. అయినా చాలామందికి రూమ్‌లు దొరక్క పోవడంతో డబ్బులు చెల్లించి టెంట్లు వేసుకున్నారు. వ్యవసాయ బావుల వద్ద డబ్బులు చెల్లించి స్నానాలు చేశారు. కల్యాణకట్ట వద్ద క్షురకులు రూ.50 నుంచి రూ.100 చెల్లిస్తేనే తలనీలాలు తీశారు. కాంగ్రెస్ సర్కారులో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఇబ్బందిపడ్డ అన్నదాత

బ్రహ్మోత్సవాల సమయంలో 7 ఆదివారాలపాటు ఏటా 4 వేల మందికి అన్నదానం చేస్తున్న మల్లన్న భక్తుడు శంకర్‌యాదవ్ ఆలయవర్గాలు, పోలీసుల చర్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈసారి ఆలయవర్గాలు, పోలీసుల ఆంక్షల కారణంగా స్వామి వారి క్షేత్రానికి దూరంగా వాహనాలు నిలిపివేయడంతో అక్కడి నుంచి వంట సామగ్రి, పనులు చేసే కార్మికులు వాటిని నెత్తిన పెట్టుకొని రాలేక ఇబ్బందులు పడ్డారు. దీంతో దాత శంకర్‌యాదవ్ తమ వాహనాలకు అనుమతి ఇవ్వాలని పోలీసులు, ఆలయవర్గాల దృష్టికి తీసుకుపోయిన వారు పట్టించుకోలేదు.

## బీజేపీపై కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు



న్యూఢిల్లీ,బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తనను బీజేపీలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఢిల్లీలోని రోహిణిలో పాఠశాలకు శంకుస్థాపన చేసిన అనంతరం కేజ్రీవాల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "బీజేపీ వాళ్లు మనపై ఎలాంటి కుట్రలైనా పన్నుతారు. కానీ.. నేను భయపడకుండా, వారికి లొంగకుండా గట్టిగా నిలబడ్డాను. నన్ను బీజేపీలో చేరమని బలవంతం చేస్తున్నారు. బీజేపీలో చేరితే నాపై ఏ కేసులు లేకుండా వదిలేస్తారని చెప్తున్నారు. కానీ నేను బీజేపీలోకి ఎప్పటికీ వెళ్లనని తెగేసి చెప్పాను. నేను బతికి ఉండగా అది జరగని పని" అని కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు. ఢిల్లీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం తన బడ్జెట్‌లో 40 శాతం ఖర్చు పాఠశాలలు, ఆసుపత్రులపై కేటాయిస్తోందని.. కానీ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం జాతీయ బడ్జెట్‌లో 4 శాతం మాత్రమే ఖర్చు చేస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఈరోజు ఏజెన్సీలన్నీ మన వెంటే ఉన్నాయన్న ఆయన.. మనీస్ సిసోడియా, సత్యంద్ర జైన్ చేసిన తప్పులు పాఠశాలలను, ఆసుపత్రులు, మొహల్లా క్లినిక్‌లు నిర్మించడమేనని అన్నారు. ఒకవేళ మనీష్ సిసోడియా పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేయకపోయి ఉంటే, ఆయన అరెస్ట్ అయ్యుండేవాడు కాదన్నారు. వాళ్లు అన్ని రకాల కుట్రలు సృష్టించారని, కానీ తమని మాత్రం అడ్డుకోలేకపోయారని తెగేసి చెప్పారు. తనపై ప్రజల ప్రేమ, ఆశీర్వాదాలు ఉంటే చాలని.. ఇంకేమీ కోరుకోవడం లేదని తెలిపారు. ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలను బీజేపీ నేతలు ఫిరాయింపులకు ప్రోత్సహించారంటూ చేసిన ఆరోపణలపై పోలీసులు కేజ్రీవాల్‌కు, మంత్రి ఆతిశీకి నోటీసులు ఇచ్చారు. ఎ ఆమెకు నోటీసులు అందించిన కొన్ని గంటల తర్వాత అరవింద్ కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ ఎమ్మెల్యేలలో ఏడుగురిని కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని ఆప్ పేర్కొంది. ఈ వ్యవహారంలో కేజ్రీవాల్‌కి కూడా నోటీసులు అందాయి. శనివారం ఐదు గంటల డ్రామా తర్వాత ఢిల్లీ పోలీసు క్రైమ్ బ్రాంచ్ ముఖ్యమంత్రికి నోటీసును అందజేసింది. ఈ కేసు విచారణకు సంబంధించి మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని కోరింది.

## ప్లాస్టిక్ రహిత మేడారం జాతరకు ప్రజలు సహకరించాలి

### తెలంగాణ రాష్ట్ర డిజిపి రవికుమార్ గుప్త ఐపీఎస్



పోలీస్ శాఖ తరపు నుంచి డిజిపి రవికుమార్ గుప్తా గారు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హర పల్లి గారు మాట్లాడుతూ ముందు పెల్లి అడుగులేని విధంగా మేడారం జాతరలో పసుపు కుంకుమలు మొదలుకొని అమ్మవార్లకు సమర్పించే బెల్లం వరకు పూర్తిగా విష రసాయనాలు వాడుతూ మేడారంలో జీవవైద్యం పూర్తిగా దెబ్బతీస్తున్నారు జంపన్న వాగులో పూర్తిగా సభ్యులను డిటర్జెంట్లు షాంపులను విరివిరిగా వాడుతూ మేడారం భూమి స్థారవంతాన్ని దెబ్బతీస్తున్నారు

**(హైదరాబాద్)** ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన సేవ్ మేడారం క్లీన్ మేడారం క్లీన్ మేడారం సే నోటు ప్లాస్టిక్ గోడపత్రికలను ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి గారు తెలంగాణ రాష్ట్ర డిజిపి రవి గుప్తా గారు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ సిహెచ్ భద్ర కోనేటి నిఖిల్ సాయి సంస్థ ప్రతినిధి రామలింగారెడ్డి గారు సంయుక్తంగా విడుదల చేశారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ ప్రధాన కార్యాలయం హైదరాబాదులో అనంతరం డిజిపి గారు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ సంస్థ గత 12 సంవత్సరాలుగా చేస్తున్న కృషిని అభినందించారు. రెండు కోట్ల మంది మేడారం మహా జాతరలో అతి గొప్ప మహా జాతర భక్తులందరూ మేడారం మేడారం పరిసర ప్రాంతాల్లో ఉన్న జీవవైవిద్యాన్ని జీవులను వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భక్తురాలు మీద భక్తుడు మీద ఉంది ఈ జాతరలో విచ్చలవిడిగా కాలుష్యాన్ని విడుదల చేయకుండా ప్లాస్టిక్ ని విచ్చలవిడిగా భారీ ఎక్కడ పడితే అక్కడ పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్త తీసుకోవాలని రాష్ట్ర ప్రజలకు దేశ ప్రజలకు ఇప్పటికైనా మేడారం భక్తులు వనదేవతల్ని కాపాడుకోవడానికి ప్రపంచ పర్యావరణ సంస్థతో కలిసి రావాలని అందుకోసం అమెరికా నుంచి బయలుదేరి వచ్చానని ఈ సందర్భంగా హరి గారు పేర్కొన్నారు ఈ సందర్భంగా సంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భద్రా నిఖిల్ గారు మాట్లాడుతూ మేడారం మహా జాతర సందర్భంగా కనీసం లక్ష క్లాత్ బ్యాగులు పంచాలని తమ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది మేడారం జాతరలో ఫ్లెక్సీలను పూర్తిగా నివారించి కాలుష్యరైత మేడారం జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్ ఫోర్స్ కమిటీని నియమించి జాతరలో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వాటర్ బాటిలను ప్లాస్టిక్ కవర్లను సాధ్యమైనంతవరకు భక్తులను పోలీస్ శాఖ వారు ప్రభుత్వంలోని అన్ని విభాగాల వారు ఎవరికివారు స్వచ్ఛందంగా ఈ మేడారం మహా జాతర కాలుష్య రహితంగా పర్యావరణహితంగా భవిష్యత్తు తరాలకి ఉపయోగపడే విధంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని ప్రపంచ పర్యావరణ సంస్థ అభిప్రాయపడింది

## టీఎస్ పీఎస్సీ కార్యదర్శిగా నవీన్ నికోలస్..

### మరో ఆరుగురికి శాఖల మార్పు



హైదరాబాద్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శిగా.. ఎస్సీ గురుకుల విద్యాలయాల కార్యదర్శి నవీన్ నికోలసన్ ను నియమించింది ప్రభుత్వం. రాష్ట్రంలో 9 మంది ఐఏఎస్ అధికారులను, 1 ఐఎఫ్ఎస్ అధికారిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నికోలస్ గతంలో గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకుడిగా పనిచేసినపుడు గురుకుల నియామక బోర్డు కన్వీనర్ గా బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో గురుకుల పోస్టుల భర్తీ ప్రక్రియను పర్యవేక్షించిన అనుభవం ఆయనకు ఉంది. ఇక ఇటీవలే ఐఏఎస్ లుగా పదోన్నతులు పొంది వెయిటింగ్ లో ఉన్న సీతాలక్ష్మి, ఫణీంద్రరెడ్డిలకు కూడా పోస్టింగులు ఇచ్చింది. ఐఎఫ్ఎస్ అధికారి VSNV ప్రసాద్ పౌర సరఫరాల సంచాలకుడిగా నియమితులయ్యారు.ఇప్పటి వరకూ TSPSC కార్యదర్శిగా ఉన్న అనితా రామచంద్రన్ ను పంచాయతీరాజ్ కమిషనర్ గా బదిలీ చేసింది. చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ గా ఉన్న బాలమాయాదేవిని బీసీ సంక్షేమశాఖ కమిషనర్ గా, పంచాయతీరాజ్ కమిషనర్ గా ఉన్న ఎం హన్మంతరావును సమాచార, పౌర సంబంధాల కమిషనర్ గా నియమించింది. సమాచార, పౌర సంబంధాల కమిషనర్ గా ఉన్న కె. అశోక్ రెడ్డిని ఉద్యాన డైరెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.అలాగే.. వ్యవసాయ కమిషనర్ బి.గోపి ని మత్స్యశాఖ కమిషనర్ గా నియమించింది. క్రైస్తవ మైనారిటీ సంస్థ ఎండీ నిర్మల కాంతివెస్లీని స్త్రీ, శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ గా బదిలీ చేసింది. చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ గా జి. ఫణీంద్రరెడ్డిని, ఎస్సీ గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా సీతాలక్ష్మిలను నియమించింది. జూ పార్కుల డైరెక్టర్ గా ఉన్న వీఎస్ ఎన్ వీ ప్రసాద్ ను పౌరసరఫరాల డైరెక్టర్ గా బదిలీ చేసింది.

## వరుడు లేకుండానే పెండ్లి!..

### యూపీలో సామూహిక వివాహాల స్కామ్



హైదరాబాద్, ఉత్తరప్రదేశ్‌లో ఘరానా మోసం బయటపడింది. సామూహిక వివాహాల పథకం కింద ప్రభుత్వం అందజేసే సొమ్మును కాజేసేందుకు కేటుగాళ్లు నకిలీ పెండ్లిండ్లు నిర్వహించారు. వరుడు లేకుండానే వందలాది మహిళలు ఎవరికి వారు మెడలో దండలు వేసుకొని పెండ్లి తంతు మమ అనిపించడం ఒక ఎత్తు అయితే.. రూ.500–రూ.2000 ఇచ్చి కిరాయికి తీసుకొచ్చిన వారిని ఈ కార్యక్రమంలో కూర్చొబెట్టడం మరో ఎత్తు.గత నెల 25న బలియా జిల్లాలో జరిగిన సామూహిక వివాహ కార్యక్రమంలో జరిగిన ఈ స్కామ్‌ను చూపే వీడియో వైరల్‌గా మారింది. ఈ కుంభకోణానికి సంబంధించి ఇద్దరు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సహా మొత్తం 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ రోజున కార్యక్రమంలో భాగంగా 568 జంటలకు పెండ్లిండ్లు జరుగ్గా.. అందులో దాదాపు 200 జంటలు నకిలీ అని తేలినట్టు అధికారులు వెల్లడించారు.వీరిలో కొంత మంది గతంలో పెండ్లి చేసుకొన్న వారు, పిల్లలున్న తల్లిదండ్రులు కూడా ఉన్నారని, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే కేత్కి సింగ్ ముఖ్య అతిథిగా హాజరు కావడం గమనార్హం.యూపీలో సామూహిక వివాహాలు చేసుకొన్న జంటలకు ప్రభుత్వం రూ.51 వేల ఆర్థిక సాయం అందిస్తున్నది.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఎస్ఐ సురేష్



మహమ్మదాబాద్ :ప్రజలకు రక్షణ కల్పించవలసిన పోలీసులు భక్షకులుగా తయారయ్యారు . ప్రజలకు తక్షణ సేవలు అందించవలసిన పోలీసులు లంచ అవతారాలకు పాల్పడుతున్నారు. ఆదివారం మహబూబ్నగర్ జిల్లా మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సురేష్ నిందితుడు నుంచి 20వేలు లంచం తీసుకుంటున్నగా ఏసిబి డిఎస్పి కృష్ణ గౌడ్ సారథ్యంలో రెడ్ హ్యాండెడ్గా పట్టుకోవడం జరిగింది.గండిడు మండలం పగిడాల గ్రామానికి చెందిన సిహెచ్ కృష్ణారెడ్డి ఇద్దరు కుమారులు ఉండగా చిన్న కుమారుడి వివాహ నిమిత్తం రిమాండ్ బెయిల్ చేసే క్రమంలో 50వేలు డిమాండ్ చేయగా అప్పట్లో 30వేలు ఇవ్వడం జరిగింది . బెయిల్ మీద బయటికి వచ్చిన తర్వాత ఎస్సై సురేష్ మరో 20 వేల కోసం ఒత్తిడి పెంచడంతో కృష్ణారెడ్డి కుమారులు ఆదివారం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.ఎస్సై సురేష్ కు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ లంచం తీసుకుంటున్న కేసులు ఎస్సైతోపాటు సిబ్బంది ఇస్మాయిల్ కూడా ఉన్నారని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసిబి డిఎస్పి కృష్ణ గౌడ్ తెలిపారు

# నెల్లూరులో మైనార్టీకి సీటు దక్కడంపై సంబరాలు

నెల్లూరు,వై నాట్ 175..ఈ టార్గెట్ పై గురి పెట్టిన వైసీపీ హైకమాండ్ మార్పే మంత్రంగా అభ్యర్థుల ఎంపికలో తన మార్క్ చాటుకుంటోంది. ఇప్పటికే ఐదు జాబితాలు విడుదల వైసీపీ .. తాజాగా ఆరో జాబితాను ప్రకటించింది. ఆరో జాబితాలో నాలుగు లోక్‌సభ.. 6 అసెంబ్లీ మొత్తంగా పది సెగ్మెంట్లకు కొత్త ఇంచార్జ్‌లను నియమించారు వైఎస్ జగన్.. సామాజిక సమీకరణాలు.. స్థానిక పరిస్థితులు.. ఇవే కొలమానంగా.. గెలుపే లక్ష్యంగా మార్పులు చేర్పులు చేశారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ అభ్యర్థుల ఎంపికలో మార్పులు చేర్పులు చేసినట్లు నేతలు పేర్కొంటున్నారు. అయితే, ఎంతో ఆసక్తికరంగా మారిన నెల్లూరు సిటీ అసెంబ్లీ స్థానానికి డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌ను నియమించింది. నెల్లూరు సిటీ నుంచి మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ను నరసరావుపేట ఎంపీ స్థానానికి బదిలీ చేసింది. ఖలీల్‌ను నెల్లూరు ఇన్‌ఛార్జ్‌గా నియమించడంతో కార్యకర్తలు సంబరాల్లో మునిగితేలుతున్నారు. వైసీపీ ప్రకటించిన ఆరో జాబితాలో స్థానం దక్కించుకున్న నేతలు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెప్పారు. తిరుపతి జిల్లా జీడి నెల్లూరు అసెంబ్లీ సమన్వయకర్తగా తన పేరు ప్రకటించడంపై డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధన్యవాదాలు చెప్పారు. తన ఊపిరి ఉన్నంతవరకు జగన్‌తోనే ఉంటానని మరోసారి తేల్చిచెప్పారు. అన్ని మండలాల నేతలను సమన్వయం చేసి భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తంచేశారు. వైసీపీ ప్రకటించిన ఆరో జాబితాలో చోటు దక్కడంపై రాజమండ్రిలో సంబరాలు మిన్నంటాయి. ఎంపీ కార్యాలయంలో అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, స్థానిక ఎంపీ భరత్ నేతలు, కార్యకర్తలతో కలిసి బాణాసంచా కాల్చారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. తనపై సీఎం జగన్ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా భారీ మెజారిటీతో గెలిచి బహుమతిగా ఇస్తామని ప్రకటించారు.

# ఎంపీ టికెట్ ఎవరికి?

గుంటూరు టీడీపీలో గుంటూరు ఎంపీ సీటుపై ఇద్దరు నేతల మధ్య పోటీ ఎక్కువైంది. పార్టీ కచ్చితంగా గెలుస్తుందని లెక్కలేసుకుంటున్న ఆ స్థానాన్ని పార్టీకి ఆర్థికంగా అండదండగా నిలిచిన ఇద్దరు ప్రముఖులు ఆశిస్తుండటంతో ఎటూ తేల్చుకోలేకపోతోంది టీడీపీ అధిష్టానం. ఇద్దరూ రెండు మూడు దఫాలుగా టీడీపీ సీటును ఆశించి దక్కించుకోలేకపోయిన వారే.. చివరి వరకు వారికి టికెట్ ఇస్తామని చెప్పి.. లాస్ట్ మినిట్‌లో రేసు నుంచి తప్పించింది టీడీపీ. ఇప్పుడు కూడా అదే సీన్ రిపీట్ అవుతుందా? లేక కష్టకాలంలో ఆదుకున్నారనే కారణంతో అందలం ఎక్కిస్తుందా? అన్నదే చర్చనీయాంశంగా మారింది.

గుంటూరు టికెట్ కోసం తీవ్ర పోటీ..

.వచ్చే ఎన్నికల్లో టీడీపీ పక్కాగా గెలుస్తుందని ఆ పార్టీ క్యాడర్ లెక్కలేసుకుంటున్న నియోజకవర్గాలు గుంటూరు, నరసరావుపేట పార్లమెంటు స్థానాలు. ఈ రెండు స్థానాలకు టీడీపీలో ఎన్ఆర్ఐ పెమ్మసాని చంద్రశేఖర్‌తోపాటు భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ టికెట్లు ఆశించారు. అయితే ఆకస్మాత్తుగా ఇందులో నరసారావుపేట సీటును సిట్టింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు తన్నుకుపోవడంతో.. ఇద్దరి మధ్య గుంటూరు సీటు కోసం పోటీ ఏర్పడింది.ఎటూ తేల్చుకోలేకపోతున్న టీడీపీ అధిష్టానం..వైసీపీ నుంచి ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు రాకపోతే.. ఇద్దరూ రెండు చోట్ల పోటీ చేసే అవకాశం ఉండేది. కానీ, ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో ఇద్దరూ ఒకటేసీటు కోసం గట్టిపట్టు బడుతున్నారు. ఇద్దరూ టీడీపీకి ఆర్థికంగా అండదండలు అందించిన వారే కావడంతో ఎవరికి ఒకే చేయాలో తేల్చేకోలేకపోతోంది టీడీపీ అధిష్టానం.ఈజీగా గెలుస్తామని నమ్మకం..టీడీపీ ప్రభుత్వం వస్తే గుంటూరు ప్రాంతం రాజధానిగా అభివృద్ధి చెందే అవకాశం ఉండటంతో ఈ సీటు కోసం పోటీ తీవ్రంగా ఉంది. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని మంగళగిరి, పొన్నూరు సీట్ల నుంచి నారా లోకేశ్, ధూళిపాళ్ల నరేంద్ర పోటీ చేస్తుండటం.. వారి ప్రభావం ఎంపీ సీటుపై ఉండే అవకాశం ఉండటంతో గుంటూరులో పెద్దగా కష్టపడకుండా గెలుస్తామని నమ్మకంతో ఉన్నారు టీడీపీ నాయకులు. ఈ కారణంతోనే ఎన్ఆర్ఐ పెమ్మసాని, భాష్యం రామకృష్ణ తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు.మ్మసానికి న్యాయం చేస్తారా?వాస్తవానికి ఎన్ఆర్ఐ పెస్మసాని చంద్రశేఖర్ 2014 నుంచి టీడీపీ తరఫున ఎంపీగా పోటీ చేయాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. 2014లో నరసారావుపేట సీటు ఆశిస్తే.. మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు రూపంలో ఆయన ఆశలు నీరుగారిపోయాయి. ఇక 2019లో సిట్టింగ్ ఎంపీగా మరోసారి రాయపాటికే సీటు ఇవ్వాల్సి వచ్చింది. ప్రస్తుతం కచ్చితంగా అవకాశం దక్కుతుందనుకుంటే.. మళ్లీ సిట్టింగ్ ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు రూపంలో పెమ్మసాని ఆశలకు గండిపడింది.వరుసగా నిరాశే ఎదురవుతుండటంతో ఈసారి ప్లాన్ మార్చి గుంటూరుపై కర్చీఫ్ వేయాలని నిర్ణయించారు పెమ్మసాని. ఆలస్యం చేస్తే మళ్లీ టికెట్ చేజారిపోయే అవకాశం ఉందన్న ఉద్దేశంతో హుటాహుటిన అమెరికా నుంచి వచ్చేశారు పెమ్మసాని. పార్టీకి ఆర్థిక అండదండలు అందించిన ఆయనకు ఎలా న్యాయం చేయాలన్న అంశంపై టీడీపీ అధిష్టానం తర్జనభర్జన పడుతోంది.ఈసారి నాకే ఇవ్వాలంటున్న భాష్యం రామకృష్ణ..ఇక ఇదే సీటును ఆశిస్తున్న భాష్యం రామకృష్ణపైనా టీడీపీ నేతల్లోనూ.. అధిష్టానంలోనూ సానుకూల దృక్పథం కనిపిస్తోంది. పార్టీతో దశాబ్దకాలంగా అనుబంధం కొనసాగిస్తున్న రామకృష్ణ ప్రతి ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థులకు తనవంతు సహాయం చేసేవారని చెబుతున్నారు. భాష్యం విద్యాసంస్థల హెడ్ క్వార్టర్స్ కూడా గుంటూరు నగరంలోనే ఉండటం.. విద్యార్థుల తల్లిదండ్రులతో విస్తృత పరిచయాల వల్ల రామకృష్ణకు విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయనే అంచనా వేస్తోంది టీడీపీ. 2019 ఎన్నికల్లో నరసరావుపేట సీటు రామకృష్ణకు ఖరారు చేశారని ప్రచారం జరిగింది. కానీ, సిట్టింగ్ ఎంపీ రాయపాటి మళ్లీ పోటీ చేయడంతో రామకృష్ణకు అవకాశం దక్కలేదు. ఈసారి గుంటూరు ఇవ్వాల్సిందేనని పట్టుపడుతున్నారు భాష్యం రామకృష్ణ.ఇద్దరూ గట్టి అభ్యర్థులే కావడం%ొ% ఇద్దరు కూడా దశాబ్దాలుగా పార్టీకి ఆర్థికంగా దన్నుగా నిలుస్తుండటం వల్ల ఆ ఇద్దరికీ ఎలా సర్దుబాటు చేయాలో తేల్చుకోలేకపోతోంది టీడీపీ.. గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ నిష్క్రమణతో వచ్చిన ఈ కొత్త చిక్కును ఎలా పరిష్కరిస్తుందో చూడాల్సి వుంది.

## అన్యమతస్థులకు ఎలా ప్రవేశం కల్పిస్తారు

తిరుమల,అన్యమతస్థులను శ్రీవారి సేవకు అనుమతించే అంశాన్ని పరిలిస్తామంటూ టీటీడీ ఈవో ధర్మారెడ్డి చేసిన ప్రకటనపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ ఈవోపై ÷ర్ అయ్యారు. అన్యమతస్థులను శ్రీవారి సేవకు అనుమతించే అంశాన్ని పరిలిస్తామని ఈవో ధర్మారెడ్డి ప్రకటించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అన్యమతస్థుల సేవలను వినియోగించుకుంటామని ధర్మారెడ్డి ఏ హోదాలో ప్రకటిస్తారని ప్రశ్నించారు. టీటీడీ ఈవో అయితే ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటారా అని నిలదీశారు. అన్యమతస్థుల సేవలు టీటీడీకి అవసరం లేదన్నారు. ధర్మారెడ్డి తన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే టీటీడీలో అనేక మంది అన్యమతస్థులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. స్వామి వారికి మొక్కని వారు టీటీడీలో విధులు నిర్వర్తిస్తూ జీతాలు తీసుకుంటున్నారన్నారు. టీటీడీలో పని చేస్తున్న అన్యమతస్థ ఉద్యోగులను వెంటనే ప్రభుత్వానికి సరెండర్ చేయాలని భానుప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు.

# దేశ రాజకీయాల్లో అరుదైన ముద్ర వేసిన నేత



న్యూఢిల్లీ,రాజకీయ కురువృద్ధుడు, భాజపా అగ్రనేత ఎల్.కె. అద్వాణీకి అరుదైన గౌరవం దక్కింది. కేంద్ర ప్రభుత్వం ఆయనను దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న తో సత్కరించింది. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్రమోదీ శనివారం 'ఎక్స్ (ట్విటర్)' వేదికగా వెల్లడించారు. వాజ్‌పేయి తరవాత భారతరత్న అందుకున్న నేతగా అద్వానీ గౌరవం దక్కించుకున్నారు. దేశాభివృద్ధిలో అద్వాణీ పాత్ర కీలకమని కొనియాడారు.'అద్వాణీజీని భారతరత్న పురస్కారంతో గౌరవించనున్నాం. ఆయనతో ఫోన్‌లో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపానని అన్నారు. ఈ తరానికి చెందిన గొప్ప రాజనీతిజ్ఞులలో ఆయన ఒకరు. దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. క్షేత్రస్థాయి నుంచి జీవితాన్న ప్రారంభించి.. ఉప ప్రధానిగా దేశానికి సేవ చేశారు. పార్లమెంటర్‌లో ఆయన అనుభవం మనకు ఎన్నటికీ ఆదర్శప్రాయం. అద్వాణీజీ సుదీర్ఘ రాజకీయ జీవితం నుంచి మనం ఎన్నో నేర్చుకోవచ్చు. జాతి ఐక్యత, సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని పెంపొందించే దిశగా అసమాన కృషి చేశారు. ఆయనకు ఈ పురస్కారం దక్కడం సంతోషంగా ఉంది. ఆయనతో కలిసి మాట్లాడే అవకాశం రావడం, ఆయన నుంచి నేర్చుకోవడం నా అదృష్టంగా భావిస్తా' అని ప్రధాని రాసుకొచ్చారు. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానం చేయనున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేయడం చాలా సంతోషంగా ఉందని ఎక్స్ వేదికగా ఆయన తెలిపారు. ' భారతరత్న గౌరవం అందుకోబోతున్న ఎల్‌కే అద్వానీతో నేను మాట్లాడి అభినందనలు తెలిపాను. మన కాలంలో అత్యంత గౌరవనీయులైన రాజనీతిజ్ఞులలో ఆయన ఒకరు. దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. అద్వానీ జీవితంలో క్షేత్రస్థాయిలో పని చేయడం మొదలుపెట్టి ఉప ప్రధానమంత్రిగా దేశానికి సేవ చేసే అత్యున్నత స్థాయికి ఎదిగారు. మన హోంమంత్రిగా కూడా సేవలు అందించారు. పార్లమెంట్‌లో ఆయన అడుగులు ఎల్లప్పుడూ ఆదర్శప్రాయ మైనవి, గొప్ప దూరదృష్టితో నిండి ఉన్నాయి' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఎల్‌కే అద్వానీకి భారతరత్న అవార్డును ప్రదానం చేయడం తనకు చాలా భావోద్వేగభరితమైన క్షణమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఎల్‌కే అద్వానీతో ఉన్న రెండు ఫొటోలను ప్రధాని షేర్ చేశారు. అద్వానీ దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో పారదర్శకత, సమగ్రతతో సేవలు అందించారని కొనియాడారు. తిరుగులేని నిబద్ధత, రాజకీయ నైతికతలతో ఆదర్శప్రాయమైన ప్రమాణాలను నెలకొల్పారని ప్రధాని మోదీ ప్రశంసించారు. జాతీయ ఐక్యత, సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం ఆయన అసమానమైన కృషి చేశారని ప్రశంసల జల్లు కురిపించారు. ఆయనతో మాట్లాడి, ఆయ నుంచి పాఠాలు నేర్చుకోవడానికి తనకు లెక్కలేనన్ని అవకాశాలు లభించడం ఎల్లప్పుడు గొప్ప అదృష్టంగా భావిస్తానని మోదీ చెప్పారు. అద్వానీకి ముందు ఇటీవలే కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించారు. బిజెపి అగ్రనేత వాజ్‌పేయ్‌కి కూడా భారతరత్న ప్రకటించారు. ఇకపోతే ఎల్‌కే అద్వానీ బీజేపీకి అత్యధికకాలం అధ్యక్షుడిగా పనిచేసిన ఘనత వహించారు. 1980లో పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి అత్యధిక కాలం అధ్యక్షుడిగా కొనసాగారు. ఇక అటల్ బిహారీ వాజ్‌పేయి సారధ్యంలోని సంకీర్ణ ప్రభుత్వం తొలిసారి అధికారంలోకి వచ్చిన 90వ దశకంలో బీజేపీ ఎదుగుదల కోసం ఎల్‌కే అద్వానీ విశేష కృషి చేశారు. 2002-04 వరకు అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని మంత్రివర్గంలో ఉప ప్రధానిగా దేశానికి సేవలు అందించారు. అద్వాణీ పూర్తి పేరు లాల్ కృష్ణ అద్వాణీ. 1927 నవంబరు 8న అవిభక్త భారత్‌లోని కరాచీ లో జన్మించారు. అక్కడే సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. పాక్‌లోని హైదరాబాద్‌లో గల డీజీ నేషనల్ కాలేజీలో న్యాయవిద్యను పూర్తి చేశారు. 1941లో తన పద్నాలుగేళ్ల వయసులో ఆయన ఆరెస్సెస్‌లో చేరారు. 1947లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కరాచీ విభాగం కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. దేశ విభజన తర్వాత భారత్‌కు వలస వచ్చిన అద్వాణీ.. రాజస్థాన్‌లో సంఘ్ ప్రచారక్‌గా పనిచేశారు. 1957లో దిల్లీకి వెళ్లి జన్‌సంఘ్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 1966లో దిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ మధ్యంతర ఎన్నికల్లో విజయం సాధించారు. 1967లో దిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా గెలిచారు. 1970-72లో భారతీయ జనసంఘ్ దిల్లీ విభాగం అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆర్గనైజర్ అనే పత్రికలో నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పనిచేశారు. 1970లో దిల్లీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా తొలిసారి ఎన్నికయ్యారు. 1976లో గుజరాత్ నుంచి రెండోసారి రాజ్యసభకు వెళ్లారు. 1977-80లో జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ పార్టీ ప్రభుత్వంలో 1977-79 వరకు సమాచార, ప్రసార శాఖ మంత్రిగా పనిచేశారు. 1980లో జనతా పార్టీ ఓటమి పాలవడంతో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. 1980లో అద్వాణీ సహా కొంతమంది జన సంఘ్‌ను వీడారు. ఆ తర్వాత వాజ్‌పేయితో కలిసి 1980 ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీని స్థాపించారు. 1982లో మధ్యప్రదేశ్ నుంచి మూడోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1996లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించింది. వాజ్‌పేయి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. కానీ, ఆ ప్రభుత్వం 13 రోజులకే కూలిపోయింది. ఆ తర్వాత 1998లో మిత్రపక్షాలతో కలిసి భాజపా మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 1999లో జరిగిన ఎన్నికల్లో గాంధీనగర్ లోక్‌సభ స్థానం నుంచి అద్వాణీ గెలిచారు. 2004 ఎన్నికల్లో భాజపా ఓటమిపాలవ్వడంతో అద్వాణీ ప్రతిపక్ష నాయకుడిగా నియమితులయ్యారు. లోక్‌సభలో సుదీర్ఘకాలం పాటు ప్రతిపక్ష నేతగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో భాజపా ప్రధాని అభ్యర్థిగా పోటీచేశారు. కానీ, ఆ ఎన్నికల్లో కాషాయ దళం ఓడిపోయింది. 2014లో మరోసారి గాంధీ నగర్ నుంచి గెలుపొందిన అద్వాణీ.. 2019 నుంచి క్రియాశీల రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. అద్వానీకి భారతరత్న ప్రకటనతో బిజెపి శ్రేణుల్లో ఆనందోత్సాహం వెల్లివిరిసాయి.

# ప్రత్యర్థులు లక్ష్యంగా రాజకీయ వేధింపులు




న్యూఢిల్లీ,రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఒక రకంగా లేనివారిని మరో రకంగా చూస్తున్నారు. తాజాగా టిడిపి నేత వర్ల రామయ్య జగన్ విషయంలో చేసిన ఆరోపణలపై బిజెపి నేతలు స్పందించడం లేదు. జగన్ లోపాయకారిగా బిజెపికి అనుకూలంగా ఉన్నాడని విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో కూడా కెసిఆర్ అనుకూలంగా ఉన్నందువల్లే ఆయనపైనా ఈగ వాలనీయలేదని అంటుఎన్నారు. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామమాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అయినా.. ఇడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగపరుస్తున్న తీరుపై రాజకీయ పార్టీలో ఆందోళన చెందుతున్నాయి. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇడి అధికారులు ఏడు గంటలకు పైగా ప్రశ్నించి, అరెస్ట్ చేయడం బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌ను లక్ష్యంగా చేసుకోవడం దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి తాజా నిదర్శనం. బిజెపి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఇడి వీరిని లక్ష్యంగా చేసుకుంది. బీహార్లో మహాకూటమి ప్రభుత్వం నుండి నితీష్ కుమార్ వైదొలిగి బిజెపి పంచన చేరిన మరుసటి రోజే ఇడి విచారణ ప్రక్రియ ప్రారంభం కావడం గమనార్హం. సిబిఐ నమోదు చేసిన కేసు ఆధారంగా తేజస్వీ తండ్రి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు కూడా ఇటీవలే ఇడి నోటీసులు జారీ చేసింది. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా దశాబ్దాల తరబడి లాలూ సాగిస్తున్న పోరాటం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రివాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ప్రత్యేకహోదా కోసం నిలదీసినందుకు ఇడి తనను వేధిస్తోందంటూ గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ ఏకంగా రాజకీయాలకు గుడ్‌బై చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణాలెన్నో! 2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గత ఏడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఇడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెంది, బిజెపిని గట్టిగా వ్యతిరేకించేవారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బిజెపిలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఇడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఇడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఇడి నిర్వహించింది. అయితే, నేరం రుజువై శిక్ష పడింది మాత్రం కేవలం 10 మందికి మాత్రమే! గడిచిన 18 ఏళ్లలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఏ) కింద 5,422 మందిపై ఇడి కేసులు పెట్టి దర్యాప్తు చేయగా, 23మందికి మాత్రమే శిక్ష పడింది. ఇది కేవలం 0.5శాతం మాత్రమే! అయినా, భయపడుతున్నారంటే ఇతర దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఇడి కి ఉండటమే కారణం. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒక సారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఇ.డి కి అప్పగించారు. ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు ఇడి దాడులను అడ్డుకోవడంతో పాటు, ఆ సంస్థ సిబ్బందిపై కేసులు నమోదు చేశాయి. తాజాగా జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఇడి అధికారులు తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారంటూ కేసు దాఖలు చేశారు. తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాల్సి ఉంది. దీనిపై ఉమ్మడిగా పోరాడాల్సి ఉందని సిపిఎం నేత సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు.

## 11న దళిత సింహ గర్జన సభ

రాజమండ్రి,ఈనెల 11న దళిత సింహ గర్జన సభ నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా మీటింగ్‌కు జనం రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ సభకు జనం రాకుండా ఎవరైన అడ్డుకున్నట్టు తన దృష్టికి వస్తే కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని.. వాలంటీర్లకు కూడా హెచ్చరిస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ దళిత వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. దళితులపై హత్యలు, దాడులు జరుగుతున్నాయని, కోడికత్తి శ్రీనుకు ఐదేళ్ల నుంచి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

# ప్రభుత్వ ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ ఏదీ

అమరావతి,అమరావతి: వైసీపీ నేతల అవినీతి, అక్రమాలు, వేధింపులతో ప్రభుత్వ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నుంచీ సాగిస్తున్న అవినీతి, అరాచక పాలనకు వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు బలయ్యారన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన అమరావతి లో మీడియాతో మాట్లాడుతూ ఇవన్నీ జగన్ సర్కారు చేసిన హత్యలేనని ఆరోపించారు. అధికారం కోసం సొంత బాబాయ్‌ని బలిచ్చిన జగన్ గ్యాంగ్ తమ దోపిడీకి సహకరించని ప్రభుత్వ ఉద్యోగుల అడ్డు తొలగించుకుంటున్నారని విమర్శించారు. వైసీపీ నేతల అవినీతికి ప్రభుత్వ ఉద్యోగులు ఎందుకు బలి కావాలని ప్రశ్నించారు. ఉద్యోగులారా ఆత్మహత్యలొద్దని.. ఆత్మస్థైర్యంతో ఉండాలని, నరహంతక వైసీపీ పాలనను అంతమొందిద్దాం రావాలంటూ లోకేష్ పిలుపిచ్చారు. జగన్ ఐదేళ్ల పాలనలో వందలాది మంది ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని, ఈ వారంలో ముగ్గురు బలయ్యారని నారా లోకేష్ ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ ఫ్యాక్షన్ సైన్యాలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలని, మీకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందని భరోసా ఇచ్చారు. విశాఖ జిల్లాలో వైసీపీ భూ అక్రమాలకు సహకరించలేదని వైసీపీ నేతలే తహసీల్దార్ సనపల రమణయ్యను అత్యంత దారుణంగా దాడి చేసి హత్య చేశారని.. జగన్ పాలనలో ప్రభుత్వ అధికారుల ప్రాణాలకు రక్షణలేదని తేలిపోయిందన్నారు. బాపట్ల జిల్లా చావలి గ్రామ ఆర్బీకేలో వ్యవసాయ సహాయకురాలిగా పనిచేస్తున్న బి.పూజిత ఆత్మహత్యకు కారణం.. వైసీపీ నేతలు ఎరువులు ఎత్తికెళ్లిపోవడమేనని, బంగారు భవిష్యత్తు ఉన్న ఒక యువతిని వైసీపీ నాయకులే బలిగొన్నారన్నారు. విజయనగరం జిల్లా, రాజాంలో పంచాయతీరాజ్ శాఖలో కాంట్రాక్ట్ బేసిక్‌పై పనిచేస్తున్న జేఈ వల్లూరు రామకృష్ణని మాయచేసి వైసీపీ నేతలు సిమెంటు ఎత్తుకెళ్లారన్నారు. ఉన్నతాధికారులు సిమెంటు లెక్కలు చెప్పమంటూ ఒత్తిళ్లు తెచ్చారు. అయితే దిక్కున్నచోట చెప్పుకోమని వైసీపీ నేతలు బెదిరించడంతో రామకృష్ణ పంచాయతీరాజ్ కార్యాలయంలోనే ఉరివేసుకుని తనువు చాలించారన్నారు. ఇది వైసీపీ నేతలు చేసిన హత్య కాదా అని లోకేష్ ప్రశ్నించారు. ఇదిలావుంటే సీఎం జగన్‌కు తన ఆర్థిక భద్రతపై ఉన్న శ్రద్ధ రాష్ట్రంలోని శాంతి భద్రతలపై లేకపోవటం సిగ్గుచేటని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు. విశాఖ జిల్లాలో తహసీల్దార్ రమణయ్య హత్య దుర్మార్గమని అన్నారు. మండల మేజిస్ట్రేట్‌ను ఇంటికి వెళ్లి హత్య చేశారంటే రాష్ట్రంలో ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రలో గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదన్నారు. వైకాపా వచ్చాక రాష్ట్రమంతా రాజారెడ్డి రాజ్యాంగం, పులివెందుల పంచాగం అమలవుతోందని విమర్శించారు. జగన్ పాలనలో ప్రజల ఆస్తులకే కాదు ప్రాణాలకూ రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. ఇంతటి నేరాలు జరుగుతుంటే రాష్ట్ర హోంమంత్రి, పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. హోంమంత్రి ఎవరో వైకాపా ఎమ్మెల్యేల్లో సగం మందికి తెలియదన్నారు. తహసీల్దార్ రమణయ్య హత్యపై వెంటనే విచారణ చేపట్టి దోషుల్ని కఠినంగా శిక్షించాలని అచ్చెన్న డిమాండ్ చేశారు. రమణయ్య హత్యను ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలు బొప్పరాజు, చేబ్రోలు కృష్ణమూర్తి తీవ్రంగా ఖండించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. హత్యకు కారకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అధిక భూ వివాదాలు ఉన్న మండలాల తహసీల్దార్లకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగిపై దాడులకు సంబంధించి దోషులపై చర్యలు తీసుకోవడానికి కఠినమైన చట్టం తీసుకురావాలన్నారు. తహసీల్దార్ దారుణ హత్యకు నిరసనగా ఇవాళ 26 జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

# రూటు మార్చిన రేవంత్..

హైదరాబాద్,రేవంత్ రెడ్డి.. ఈ పేరు వినగానే తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు టక్కున గుర్తుకొచ్చేది దూకుడు స్వభావం.. రాజకీయాల్లో దూకుడుగా ముందుకెళ్తూ ప్రత్యర్థులను రేవంత్ ఉక్కిరిబిక్కిరి చేస్తూ రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య కాంగ్రెస్ హైకమాండ్‌ను మెప్పించి, తెలంగాణ ప్రజల ఆశీర్వాదం పొంది సీఎం పీఠాన్ని అదిరోహించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. రేవంత్ సీఎం అయ్యాక కొంచెం దూకుడు తగ్గించినట్లు కనిపించింది.. ఇదేమని రేవంత్ రెడ్డిని ఓ టీవీ చానెల్ ఇంటర్వ్యూలో అడిగితే.. సీఎం ముందుకు పదవి అనేది హూందాతో సాగింది.. రేవంత్ సీఎం అయిన తరువాత ప్రత్యర్థులు కాస్త హుషారైయ్యారు. రేవంత్ ఇక దూకుడుగా వ్యవహరించరు, మనం ఏమన్నా పడుతూ.. తలదించుకుంటూ పోతరులే అనుకున్నారేమో.. ప్రభుత్వాన్ని ఆరు నెలల్లో పడగొడతాం.. తరువాత మళ్లీ బీఆర్ ఎస్ దే అధికారం అంటూ కొందరు బీఆర్ ఎస్టల ఎమ్మెల్యేలు. చేస్తున్నారు. ప్రతిగా కాంగ్రెస్ నుంచి స్ట్రాంగ్ కౌంటర్ రాకపోవడంతో కొంత కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వబోయే సరికి కాంగ్రెస్ శ్రేణులు నిరాశకు గురవుతున్నారు. నిజంగానే ఆరు నెలలు , ఏడాదిలో ప్రభుత్వం కూలిపోతుందేమో.. ఎందుకొచ్చింది గొడవ కాంగ్రెస్ శ్రేణుల్లో నిరుత్సాహాన్ని గమనించిన సీఎం రేవంత్ రెడ్డి. తన అసలైన దూకుడు స్వభావాన్ని బయటకు తీసుకొచ్చారు. సీఎం పదవి అనేది హూందాతనంతో కూడుకున్నదే.. కానీ, ఆ పదవే మనల్ని నమ్ముకున్న వాళ్లను నిరుత్సాహ పరిచేలా ఉండడంతో ఆయన జూలు విదిల్చారు. అసలే కార్యకర్తలంటే ప్రాణమిచ్చే రేవంత్ రెడ్డి.. వాళ్లు నిరాశలో ఉంటే ఊరుకుంటారా? సీఎంగా హుందాగా ఉంటూనే పీసీసీ అధ్యక్షుడిగా.. తమ మాటల పదును చూపిస్తున్నారు. అలా చూపించడానికి ఇంద్రవెల్లి గడ్డను వేదికగా చేసుకున్నారు. మూడు నెలల్లో .. ఆరె నెలల్లో కేసీఆర్ ముఖ్య మంత్రి అయితడు.. నీ అయ్య ఎవరైనా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతాం అని మాట్లాడితే.. మీ ఊళ్లో యాపచెట్టుకు కోదండం వేసి కొట్టండి.. ఇది ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం.. ఇది ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం.. ఇది ప్రజ ప్రభుత్వం అంటూ రేవంత్ రెడ్డి పిలుపుతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్‌కి పిలుపునిచ్చింది. లక్షకోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని కేసీఆర్ అనుకుంటున్నారు. ని అంటే పళ్లు రాలగొడతాం అంటూ.. బీఆర్ఎస్ కు గట్టి రిటార్డ్ ఇచ్చారు రేవంత్ రెడ్డి. ఇన్నాళ్లు కొంత నిరాశతో ఉన్నకాంగ్రెస్ శ్రేణులు రేవంత్ తన సహజ దూకుడు ప్రదర్శించడంతో హురారయ్యారు. రేవంత్ ఉండగా.. ఎవడొస్తడు మన ప్రభుత్వాన్ని కూల్చేందుకు అన్నట్లుగా రేవంత్ ప్రసంగం.. కాంగ్రెస్ శ్రేణుల్లో ధైర్యాన్ని నింపింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాటి నుంచి మూడు నెలలు.. ఆరు నెలలు.. మహాఅంటే సంవత్సరంలో కూలిపోవటం ఖాయమని ప్రచారం చేస్తున్న బీఆర్ ఎస్ నేత ఇంద్రవెల్లిలో రేవంత్ ప్రసంగం ఒక స్ట్రాంగ్ హెచ్చరిక చేసింది.

# అనంతపురం టీడీపీలో హైటెన్షన్..




అనంతపురం: అధికార పార్టీలో టికెట్ల ప్రకటనతో అసంతృప్తులు బయటపడుతుంటే.. ప్రతిపక్ష టీడీపీలో ఇంకా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ దశలోనే.. అసంతృప్తి రాజుకుంటోంది. అభ్యర్థుల ఎంపిక, టికెట్ల కేటాయింపుపై పార్టీ ఎలాంటి ప్రకటన చేయకున్నా.. మీడియాలో జరుగుతున్న ప్రచారంతోనే తీవ్రంగా రియాక్ట్ అవుతున్నారు నేతలు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు ఎంపీ సీట్లకు అభ్యర్థులు ఖరారయ్యారంటూ జరుగుతున్న ప్రచారంపై ఆ ఇద్దరు నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తీవ్ర అసంతృప్తిలో ఆ ఇద్దరు నేతలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు ఎంపీ సీట్లు ఉన్నాయి. ఇందులో ఒకటి అనంతపురం కాగా, మరొకటి హిందూపురం.. ఈ రెండు సీట్ల నుంచి ఇద్దరు బీసీ నేతలను పోటీకి పెట్టాలని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లో అనంతపురం నుంచి పోటీచేసిన జేసీ దివాకర్‌రెడ్డి కుమారుడు పవన్‌కుమార్ రెడ్డికి ఇదే విషయం తేల్చిచెప్పింది అధిష్టానం. దీంతో బీసీ నేతలను బరిలోకి దింపడం పక్కా అన్న విషయం తేలిపోయింది. అయితే పార్టీ పరిశీలనలో బీసీ నేతలు అయిన కాల్వ శ్రీనివాసులు, బీకే పార్థసారథి పేర్లు ఉన్నట్లు కొన్నిరోజులుగా ప్రచారం జరుగుతుండటంతో.. ఆ ఇద్దరు నేతలు అసంతృప్తి చెందుతున్నారని చెబుతున్నారు.

అనంతపురం పార్లమెంట్ అభ్యర్థిపై ఉత్కంఠ..

అనంతపురం పార్లమెంట్‌కు కాల్వ శ్రీనివాసులు, హిందూపురం లోక్‌సభ అభ్యర్థిగా బీకే పార్థసారథిని నిలుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. కాల్వ శ్రీనివాసులు బోయ సామాజిక వర్గం నేత కాగా, బీకే పార్థసారథి కురబ సామాజికవర్గానికి చెందిన వారు. ఈ ఇద్దరినీ పార్లమెంట్ బరిలో నిలిపితే బీసీలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చినట్లు అవుతుందని టీడీపీ ఆలోచిస్తుందని చెబుతున్నారు. అయితే కాల్వ శ్రీనివాసులు ఈ ప్రచారాన్ని కొట్టిపడేస్తున్నారు. గతంలో రాయదుర్గం ఎమ్మెల్యేగా పనిచేసిన కాల్వ శ్రీనివాసులు.. మళ్లీ అదేసీటును ఆశిస్తున్నారు. అధిష్టానం కూడా తనకు రాయదుర్గం సీటు ఇస్తానని హామీ ఇచ్చిందని ఆయన చెబుతుండటంతో అనంతపురం పార్లమెంట్ అభ్యర్థిపై ఉత్కంఠ ఏర్పడుతోంది.

రాయదుర్గం టికెట్ రేసులో దీపక్ రెడ్డి, పూలనాగరాజు..

అయితే తాను రాయదుర్గం ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని కాల్వ శ్రీనివాసులు చెబుతుండటం పార్టీ ధిక్కారస్వరంగా ఆయన వ్యతిరేక వర్గం ప్రచారం చేస్తోంది. కాల్వ శ్రీనివాసులు ఆశిస్తున్న రాయదుర్గం అసెంబ్లీకి సీనియర్ నేత దీపక్‌రెడ్డి పేరుతోపాటు పూల నాగరాజు అనే నేత పేరు పరిశీలిస్తున్నారంటున్నారు. ఎంపీగా పోటీకి కాల్వ విముఖత ప్రదర్శిస్తే.. రాయదుర్గం సీటుకు తీవ్ర పోటీ ఉన్నట్లే భావిస్తున్నారు.

పెనుకొండ టీడీపీ అభ్యర్థిని నేనే అని ప్రకటించేశారు..

ఇక హిందుపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థిగా ప్రచారం జరుగుతున్న బీకే పార్థసారథి కూడా విముఖంగా ఉన్నారంటున్నారు. ప్రస్తుతం హిందూపురం పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న పార్థసారథి పెనుగొండ అసెంబ్లీ సీటును ఆశిస్తున్నారు. ఇదే సీటును కురబ సామాజికవర్గానికి చెందిన మహిళా నేత సవిత ఆశిస్తున్నారు.వైసీపీ కూడా ఈ నియోజకవర్గం నుంచి మహిళా నేత, మంత్రి ఉషశ్రీ చరణ్‌ను రంగంలోకి దింపుతోంది. కురబ సామాజిక వర్గానికి చెందిన మంత్రి ఉషశ్రీపై అదే సామాజికవర్గానికి చెందిన నేతను పోటీకి పెట్టాలని టీడీపీ ఆలోచిస్తోంది. అయితే తాను కురబ సామాజికవర్గానికి చెందిన నేతను కనుక తనకే చాన్స్ ఇవ్వాలని.. తనకు పార్లమెంట్‌కు పోటీచేసే ఆలోచన లేదని పార్థసారథి చెబుతుండటంతో అధిష్టానంపై ఒత్తిడి పెరుగుతోంది.జిల్లాలో కీలకమైన ఇద్దరు బీసీ నేతలు పార్లమెంట్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపకపోవడంతో టీడీపీ తర్జనభర్జన పడుతోందని అంటున్నారు. ఒకటి రెండు రోజుల్లో టీడీపీ-జనసేన పార్లమెంట్ అభ్యర్థుల ఉమ్మడి ప్రకటన వెలువడే అవకాశం ఉన్నందున.. అంతవరకు ఈ రెండు సీట్లపై ఉత్కంఠ కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

# ఎంపీగా జనసేనాని.. సంచలనం రేపుతున్న పవన్ కల్యాణ్ నిర్ణయం!



అమరావతి,జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌కు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు పొలిటికల్ సర్కిల్‌లో తెగ వైరల్ అవుతోంది. ఆయన ఎంపీగా పోటీ చేయబోతున్నారనే గాసిప్ ఇప్పుడు ట్రెండీగా మారిపోయింది. కాకినాడ స్థానం నుంచి పవన్ కల్యాణ్ లోక్‌సబ బరిలో ఉంటారని అంటున్నారు. అంతే కాదు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తే పొత్తుల్లో భాగంగా బీజేపీ ఆయనకు మంత్రి పదవి కూడా ఆఫర్ చేసినట్టు చెప్పుకుంటున్నారు.

సీట్లపై చర్చలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి బరిలో నిలవాలని టీడీపీ, జనసేన ఇప్పటికే ఒప్పందం చేసుకున్నాయి. రెండు పార్టీల అధినేతల ఇప్పటి వరకు పలు మార్లు సమావేశాలు కూడా అయ్యారు. అయితే సీట్ల విషయంలో చర్చలు నడుస్తున్నాయి. దీనిపై క్లారిటీ వస్తే ఒకే వేదికపై ఈ విషయాన్ని ప్రకటించబోతున్నారు. ఈ ప్రక్రియ సాగుతున్న టైంలో పవన్ పోటీపై కూడా కేడర్‌లో చాలా ఊహాగానాలు ఉన్నాయి.

పవన్ పోటీ ఎక్కడ నుంచి

మిగతా నాయకుల సంగతి పక్కన పెడితే.. పవన్ కల్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే వార్త అందర్నీ తెగ డ్రిల్ చేస్తోంది. ఈ క్రమంలో చాలా నియోజకవర్గాలు తెరపైకి వచ్చాయి. పిఠాపురం అని ఒకసారి, తిరుపతి అని మరోసారి గాజువాక, భీమవరం అని ఇలా రకరకాల ఊహాగానాలు సాగుతూనే ఉన్నాయి. ఇవేవి కాదని ఆయన ఇప్పుడు ఎంపీగా వెళ్లబోతున్నారనే వార్త ఇప్పుడు తాజాగా ట్రెండ్ అవుతోంది. టీడీపీ, జనసేన పొత్తు కుదుర్చుకున్నప్పటి నుంచి పవర్ షేరింగ్ ఉండాలంటూ పవన్ ఫ్యాన్స్ పట్టుబడుతున్నారు. ఆయనకు మద్దతు ఇచ్చే నేతలు కూడా కొందరరు ఇదే విషయంపై మాట్లాడుతున్నారు. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే రేపు ప్రభుత్వం ఏర్పాటు అయితే ఎలా అనే చర్చ కూడా నడుస్తోంది. రెండు పవర్ స్టేషన్‌లు ఒకే చోట ఉండటం ప్రమాదమని విశ్లేషకులు కూడా అంటున్నారు.

ఢిల్లీకి పవన్ కల్యాణ్

ఇలాంటి సమస్య రాకుండా పవన్ కల్యాణ్ ఇప్పుడు ఢిల్లీపై దృష్టి పెట్టినట్టు చెప్పుకుంటున్నారు. ఎలాగూ బీజేపీతో పవన్‌కు మంచి సంబంధాలే ఉన్నాయి. పొత్తులో ఉన్నామంటూ బీజేపీ నేతలు పదే పదే చెబుతున్నారు. అందులో భాగంగానే ఆయన్ని గెలిపించే బాధ్యతను జనసేన, టీడీపీ తీసుకుంటే.. తర్వాత కేంద్రంలో మంత్రి పదవి ఇచ్చే బాధ్యతను బీజేపీ తీసుకుంటుందని అంటున్నారు. ఇంకా దీనిపై మూడు పార్టీలో ఎవరూ స్పందించడం లేదు.

కాకినాడ నుంచి పవన్ పోటీ!

ఈ ప్రచారానికి బలం చేకూర్చేలా పదే పదే పవన్ కల్యాణ్ కాకినాడ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పలుదఫాలు పర్యటించారు. ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశమయ్యారు. కేడర్‌తో కూడా చర్చించారు. ఎక్కడా పోటీ విషయాన్ని ప్రస్తావించకుండానే పరిస్థితులపై పవన్ కల్యాణ్ ఆరా తీసినట్టు చెప్పుకుంటున్నారు. దీనిపై ఇంకా చర్చలు నడుస్తున్నాయని... వారం పదిరోజుల్లో పవన్ పోటీపై క్లారిటీ వస్తుందని అంటున్నారు. అప్పుడు కాని పవన్ వెళ్లేది అసెంబ్లీకా, పార్లమెంట్‌కా అనేది లేదు.

కాకినాడే ఎందుకు !

కాకినాడ లోక్‌సభ స్థానం నుంచి జనసేనాని పోటీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాపు సామాజిక వర్గం ఓట్లు బలంగా ఉండే కాకినాడ సీటు సేఫ్టీగా ఉంటుందని ఆయన భావిస్తున్నారు. అందుకే ఆయన పదేపదే ఆ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోనే పర్యటిస్తున్నారని తెలిసింది. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌పై పవన్ ఒంటికాలుపై లేవడానికి కారణం కూడా ఇదేనని చెబుతున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ సీట్లలో జనసేనకు బలమైన ఓటు బ్యాంకు ఉన్నట్లు అన్ని సర్వేల్లో తేలింది. కాబట్టి పవన్ ఇక్కడి నుంచే పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని తేలిపోవడంతో...పవన్ ఈ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. ప్రధాని మోదీ? వద్ద తనకు ఉన్న పలుకుబడితో పవన్ కావాలనుకుంటే ఎప్పుడో కేంద్రమంత్రి అయ్యిండే వారు కానీ....ప్రజాబలంతో గెలిచే చట్టసభల్లో అడుగుపెట్టాలని ఆయన బలంగా నిర్ణయించుకున్నారు. కావున లోక్‌సభ బరిలో దిగుతున్నారని తెలుస్తోంది. ప్రధాని మోదీ నుంచి కేంద్రమంత్రి పదవిపై హామీ వచ్చిన తర్వాతే ఆయన లోక్‌సభ బరిలోదిగుతున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి.

# కర్నూలు వైసీపీలో ఏం జరుగుతోంది?

కర్నూలు: అధికార పార్టీలో కర్నూలు జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఇన్‌చార్జుల మార్పుచేర్పుల్లో ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనని టెన్షన్‌తో నేతలు నిద్రపట్టని రాత్రులు గడుపుతున్నారు. కొత్తగా ఇన్‌చార్జి పదవి ఇచ్చినా ఎన్నికల వరకు కొనసాగిస్తారనే గ్యారెంటీ లేక.. అధిష్టానం ఆలోచనలు ఏంటో తెలుసుకోలేక.. అయోమయాన్ని ఎదుర్కొంటున్నారు.

మార్పుల్లో మార్పుతో అయోమయ పరిస్థితి..

కర్నూలు జిల్లాలో అధికార వైసీపీకి గట్టి క్యాడర్ ఉంది. గత ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాలు గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది వైసీపీ. ఐదేళ్లుగా పార్టీ క్యాడర్‌పై పూర్తి పట్టుసాధించిన అధిష్టానం.. ఎన్నికల ముందు తీసుకుంటున్న నిర్ణయాలతో క్యాడర్‌ను గందరగోళంలోకి నెట్టేస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జుల మార్పుల్లో భాగంగా జిల్లాలో ఇప్పటికే కొన్ని చోట్ల కొత్తవారికి బాధ్యతలు అప్పగించగా, వారినీ మళ్లీ మార్చేస్తుండటంతో పార్టీలో ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు వైసీపీ కార్యకర్తలు.

ఎన్నికల వరకు ఎవరి పదవికి నో గ్యారెంటీ..

జిల్లాలోని ఎమ్మిగనూరు స్థానానికి కొద్దిరోజుల క్రితం మాచాని వెంకటేశ్‌ను సమన్వయకర్తగా నియమించారు. ఈయనే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిగా భావించారు. ఐతే వెంకటేశ్‌ను ఇన్‌చార్జిగా నియమించిన కొద్దిరోజులకే ఆయన స్థానంలో బుట్టా రేణుకను తెరపైకి తీసుకువచ్చారు. వాస్తవానికి ఎమ్మిగనూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని తప్పించి.. ఆయన సూచించిన మాచాని వెంకటేశ్‌ను తీసుకువచ్చిన పార్టీ.. అంతలోనే మార్పు చేసింది. ఎమ్మిగనూరు ఎపిసోడ్



గమనిస్తే.. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు ఎవరూ శాశ్వతంగా ఆ పదవిలో ఉంటారనే గ్యారెంటీ లేదని సంకేతాలు పంపినట్లైంది.

తమ నేతను బలిపశువును చేసిందని ఆవేదన..

ఇక ఎమ్మిగనూరు కొత్త ఇన్‌చార్జిగా వచ్చిన బుట్టా రేణుక గతంలో కర్నూలు ఎంపీగా పనిచేశారు. 2014లో ఎంపీగా గెలిచిన రేణుక.. ఆ తర్వాత టీడీపీలోకి వెళ్లారు. గత ఎన్నికల ముందు మళ్లీ వైసీపీలో చేరారు. ఈసారి కర్నూలు ఎంపీగా పోటీ చేయాలని భావించినా, ఎమ్మిగనూరులో చేనేత వర్గం ఓట్లు ఎక్కువగా ఉంటాయనే ఉద్దేశంతో రేణుకను ఇక్కడి నుంచి పోటీకి దించాలని నిర్ణయించింది పార్టీ. ఎమ్మిగనూరులో గెలుపు కోసం పార్టీ తీసుకున్న నిర్ణయం తమ నేతను బలిపశువును చేసిందని వారం రోజుల ఇన్‌చార్జి మాచాని వెంకటేశ్ వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# రాజకీయాల్లోకి దిగిన భట్టి సతీమణి



హైదరాబాద్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని ఖమ్మం పార్లమెంట్ సీట్ కోసం దరఖాస్తు సమర్పించారు. తన మద్దతుదారులతో కలిసి అట్టహాసంగా గాంధీ భవన్‌కు వచ్చి స్వయంగా దరఖాస్తు చేశారు. ఇప్పటికే ఆమె మద్దతుదారులు ఒకసారి దరఖాస్తు సమర్పించారు. శనివారం ఆమె స్వయంగా వచ్చి అప్లికేషన్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె అనుచరులు బ్యాండ్ మేళా, టపాసుల మోతలతో గాంధీ భవన్ వద్ద హంగామా చేశారు. అంతకుముందు దాదాపు 500 కార్ల కాన్వాయ్ తో ఖమ్మం నుంచి ఆమె భారీ ర్యాలీగా తరలివచ్చారు. ఖమ్మం నగరంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత భారీ కాన్వాయ్ తో ర్యాలీగా హైదరాబాద్ వచ్చారు. ప్రత్యక్ష రాజకీయాలలో వస్తున్నానని, ఖమ్మం లోక్ సభ స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. సోనియా, ప్రియాంక పోటీకి దిగినా.. లేక హైకమాండ్ ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే తమందరి లక్ష్యమని చెప్పుకొచ్చారు.ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు పలువురు నాయకులు ఆసక్తి చూపడంతో ఆసక్తి నెలకొంది. ఇటీవల మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి ప్రెస్ మీట్ పెట్టి ఇక్కడి నుంచి సోనియా గాంధీ పోటీ చేస్తారని లేకుంటే, తానే బరిలో నిలుస్తానని స్పష్టం చేశారు. ఇదే సీటు కోసం కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి, మరో రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లు కూడా పోటీలో ఉన్నారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తే.. ఖమ్మం లోక్‌సభ సెగ్మెంట్ నుంచి బరిలో ఉంటారనే వార్తలు కూడా వస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఖమ్మం కాంగ్రెస్ పార్టీ హాట్‌సీటుగా మారిందనే చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలోని 19 పార్లమెంట్ స్థానాలున్నాయి.ఈ 17 స్థానాల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తుంది.ఈ మేరకు ఆయా పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఇంచార్జీలుగా మంత్రులను ఆ పార్టీ నియమించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఖమ్మంలో భారీ మెజార్టీ వచ్చింది. అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రత్యర్థులకు అందనంత దూరంలో ఉండటంతో గెలుపు ఖాయమని భావిస్తున్నారు. దీంతో టిక్కెట్ కోసం పోటీ పడే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. మల్లు భట్టి విక్రమార్క హైకమాండ్ వద్ద కూడా తన భార్యకు టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎవరి పేరునూ సిఫారసు చేయడం లేదని.. సోనియా గాంధీని మాత్రం పోటీ చేయాలని కోరుతున్నారని అంటున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ ఎవరికి సీటిస్తే వారిని గెలిపిస్తామని చెబుతున్నారు.

# వేమిరెడ్డి జగన్ కి షాక్ ఇస్తారా...!?



అమరావతి, నెల్లూరు జిల్లాలో బలమైన నాయకుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. అంగబలం అర్ధబలం గట్టిగా ఉన్న నేత. ఆయనకు జగన్ 2018లో రాజ్యసభ సీటు ఇచ్చారు అంటేనే ఆయన టాలెంట్ నాడే గుర్తించినట్లుగా భావించాలి. మేకపాటి రాజమోహన్ రెడ్డి తరువాత మరీ నెల్లూరులో పార్టీలో ముఖ్యుడిగా నిలిచారు వేమిరెడ్డి. పార్టీ పట్ల విధేయతతో ఉంటూ అన్ని రకాలుగా సహకరించే వేమిరెడ్డి ఇపుడు జగన్ కి షాక్ ఇవ్వబోతున్నారా అన్న చర్చకు తెర లేచింది. వేమిరెడ్డి రెడ్డి తన సతీమణి ప్రశాంతికి నెల్లూరు అర్బన్ అసెంబ్లీ టికెట్ ఆశించారు. అలాగే జగన్ కూడా ఇస్తారని అనుకున్నారు. ఎందుకంటే ప్రభాకర్ రెడ్డిని నెల్లూరు ఎంపీగా నిలబెట్టబోతున్నారు. ఆయన తన పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యే సీట్ల విషయంలో సలహాలు ఇవ్వడం కూడా సహజం. పైగా అందరినీ గెలిపించుకోవాల్సి ఉంటుంది. నెల్లూరు వైపు చూస్తే మరో జిల్లాకు చెందిన మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కి వేమిరెడ్డికి పడ్డాడు, అందుకే ఆయనకు టికెట్ ఇవ్వవద్దు అని చెప్పారు. దాని ప్రకారం వైసీపీ అధినాయకత్వం అనిల్ ని ఏకంగా జిల్లాలు మార్చి గుంటూరు నర్సారావుపేట ఎంపీ టికెట్ ఇచ్చింది. అది ఒకే అనుకున్న వేమిరెడ్డి కోరిక మేరకు ఆయన సతీమణికి టికెట్ ఇవ్వకుండా అనిల్ కుమార్ అనుచరుడు అయిన ఖలీల్ కి టికెట్ ఇవ్వడంతో వేమిరెడ్డి మందలిస్తున్నారు అని టాక్. పార్లమెంట్ మధ్యతరహా బడ్జెట్ సమావేశాల కారణంగా ఆయన ప్రస్తుతం ఢిల్లీలో ఉంటున్నారు. గత రాత్రి విడుదల చేసిన ఆరవ జాబితా తరువాత నుంచి వేమిరెడ్డి ఏకంగా అధినాయకత్వానికి రాలేదు. ఏకంగా తన ఫోన్ ని స్విచాఫ్ చేశారని గాసిప్స్ వినిపిస్తున్నాయి. అంతే కాదు నెల్లూరు ఏర్పాటు తన అనుచరులకు ఆయన ఫోన్ చేసి పార్టీ కార్యక్రమాలను ఆపు చేశారని అంటున్నారు. దీనిని బట్టి వేమిరెడ్డి ఏమి ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు అంటున్నారు. వేమిరెడ్డి వైఖరితో వైసీపీ అధినాయకత్వం మల్లగుల్లాలు పడుతోంది అని టాక్. ఆయన ఫోన్ కి దగ్గరలో ఉన్న అనుచరుల ద్వారా అయినా ఫోన్ కలిపే ప్రయత్నం చేస్తున్నా అవేమీ వర్కౌట్ కావడం లేదు. ఇటీవల కాలంలో వేమిరెడ్డి అధినాయకత్వం వైఖరి పట్ల కాస్త గుర్రుగా ఉంటున్నారని టాక్. పైగా ఈ తరహా రాజకీయాలు చేయలేమని సన్నిహితులతో ఆయన రాజకీయ వైరాగ్యం ప్రాటించినట్లుగా కూడా చెప్పారు. ఇపుడు ఆయన ఏమైనా సంచలన నిర్ణయం దిశగా అడుగులు వేస్తారా అన్నది చర్చకు వస్తుంది. ఇప్పటికే నెల్లూరు జిల్లాలో బలమైన రెడ్లు చాలా మంది పార్టీని వీడిపోయారు. ముగ్గురు ఎమ్మెల్యేలు గుడ్ బై చెప్పారు. వేమిరెడ్డి అలాంటి నిర్ణయం తీసుకుంటే వైసీపీకి అది బిగ్ షాక్ గా పరిణమిస్తుంది అంటున్నారు. ఎలాగోలా వేమిరెడ్డిని టచ్ లోకి తెచ్చుకుని ఆయనకు నచ్చచెప్పాలని వైసీపీ చూస్తోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## కెఆర్ఎంబికి ప్రాజెక్టుల అప్పగింత దారుణం

గద్వాల,కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంపై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. గద్వాల జిల్లాలోని జూరాల జలాశయంపై ధర్నకు దిగారు. పార్టీ కార్యకర్తలు, రైతులతో కలిసి బరాజ్‌పై భైటాయించి నిరసన వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కేఆర్ఎంబీ పరిధిలోకి ఉమ్మడి పాలమూరు జలషాయం వెళ్తే భవిష్యత్‌లో కృష్ణనది పరివాహక ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు తప్పవన్నారు. ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆరోపించారు.

# అత్యంత రద్దీ నగరాల జాబితాలో ఆరోస్థానంలో బెంగళూరు..!

హైదరాబాద్, ప్రపంచంలోనే అత్యంత రద్దీ నగరాల జాబితాలో టెక్ సిటీ, స్టార్టప్‌లకు రాజధానిగా నిలిచిన బెంగళూరు నగరంలో ఆరో స్థానంలో నిలిచింది. డచ్ లొకేషన్ టెక్నాలజీ నిపుణుడు టామ్ టామ్ 2023 సంవత్సరం ఆధారంగా ఈ నివేదికను విడుదల చేశారు. 2022లో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నగరాల్లో బెంగళూరు రెండో స్థానంలో నిలవడం గమనార్హం. గత ఏడాది బెంగళూరులో పది కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు సగటున 29 నిమిషాలు పట్టింది. బెంగళూరులో ప్రస్తుతం 28 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతున్నది.2023లో బెంగళూరులో రద్దీ సమయాల్లో వాహనాల సగటు వేగం గంటకు 18 కిలోమీటర్లు. బెంగళూరు ప్రజలు ఏడాదిలో సుమారు 132 గంటల ట్రాఫిక్‌లో సమయం వృథా అయ్యింది. 2023 నాటికి ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నగరంగా లండన్ నిలిచిందని నివేదిక పేర్కొంది. లండన్‌లో సగటు వేగం గంటకు 14 కిలోమీటర్లు. లండన్‌తో పాటు పాటు ఐర్లాండ్‌లోని డబ్లిన్‌లో గంటకు 16 కిలోమీటర్లు. కెనడాలోని టొరంటో నగరంలో గంటకు 18 కిలోమీటర్లు. ఇటలీలోని మిలన్ నగరంలో గంటకు 17 కిలోమీటర్లు.పెరూలోని లిమాలో గంటకు 17 కిలోమీటర్లు. ఈ ఐదునగరాల అత్యంత రద్దీ నగరాల జాబితాలో టాప్-5లో నిలిచాయి. ఇదే జాబితాలో పుణే నగరం సైతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత రద్దీగా, ట్రాఫిక్ అత్యధికంగా ఉండే నగరాల జాబితాలో ఏడో స్థానంలో నిలిచింది. పుణేలో పది కిలోమీటర్ల దూరం ప్రమాణం చేసేందుకు 27 నిమిషాల 50 సెకన్ల సమయం పడుతున్నది. ఇక్కడ వాహనాల సగటు వేగం గంటకు 19 కిలోమీటర్లు. పుణే తర్వాత బుకారెస్ట్, మనీలా, బ్రస్సెల్స్ నగరాలున్నాయి.రిపోర్ట్‌లో దేశ రాజధాని రాజధాని ఢిల్లీ అత్యంత రద్దీగా ఉండే నగరాల్లో 44వ స్థానంలో ఉన్నది. ఇక్కడ రద్దీ సమయంలో సగటు వేగం గంటకు 24 కిలోమీటర్లు. ఇదే జాబితాలో ఆర్థిక రాజధాని ముంబయి ప్రపంచవ్యాప్తంగా 54వ స్థానంలో నిలిచింది. గతేడాది సెప్టెంబర్ 27న బెంగళూరులో అత్యధిక ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆ రోజు 10 కిలోమీటర్ల



దూరం ప్రయాణించడానికి సగటున 32 నిమిషాలు పట్టింది. టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 55 దేశాల్లోని 387 నగరాలను కవర్ చేయగా.. దేశవ్యాప్తంగా ఇంధన ఖర్చులు, కర్బన ఉద్గారాలను సైతం అంచనా వేసింది.

## ప్రభుత్వ సలహాదారుగా షబ్బీర్ బాధ్యతలు

హైదరాబాద్,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని కార్యాలయంలో ప్రార్థనల అనంతరం పదవీ బాధ్యతలు చేపట్టారు.రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ సలహాదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన షబ్బీర్‌ను రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణ రావు, బీసీ కమిషన్ చైర్మన్ కఅష్ణ మోహన్ రావు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.షబ్బీర్‌ను కలిసిన వారిలో న్యూ ఢిల్లీలో ప్రభుత్వ సలహాదారు మల్లు రవి, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఉమర్ జలీల్, గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి నవీన్ నికోలస్, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com